## ప్రత్యేక వైద్యశిబిరం

ధర్పల్లి, సెప్టెంబర్ 14 : ప్రస్తుతం వైరల్ ఫీవర్ ప్రజలుతున్న నేపథ్యంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జిల్లా కేంద్రలోని ప్రభుత్వ దవాఖాన వైద్యులతో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కీళ్ల, ఎముకల వైద్య నిపుణుడు మోహన్‌రెడ్డి, మత్తు వైద్యుడు సబాహత్, ఆరోగ్య సిబ్బంది 150 మంది గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 14 : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ సూచించారు. డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ పండుగ, అదే రోజు కొన్ని గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు ఉన్నాయని, అన్ని వర్గాల వారు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై ఎండీ షరీఫ్, డిచ్‌పల్లి రైల్వేస్టేషన్, బర్ధిపూర్, ధర్మారం, నడిపల్లి, ఘన్‌పూర్ ఇస్లాంపుర కాలనీ మసీదుల సదర్లు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న 1991-92కు చెందిన ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

ధర్పల్లి, సెప్టెంబర్ 14 : మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ మొదటి బ్యాచ్ 1991-92కు చెందిన విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. తమతో పాటు చదువుకొని, వారం క్రితం గుండెపోటుతో మృతిచెందిన ఐఆర్ చంద్రశేఖర్ కుటుంబానికి పూర్వ స్నేహితులు రూ. 20 వేలు అందజేశారు. గ్రామంలో ఆరు సిమెంట్ బెంచీలను అవసరమున్న చోట ఏర్పాటు చేయించారు. యువకులను గ్రామస్తులు అభినందించారు. వీడీసీ మాజీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కోశాధికారి నాగెల్లి గోవర్ధన్, పూర్వ విద్యార్థులు నర్సయ్య, జనార్ధన్, వినీల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రేమ్, లింబాద్రి, రాంచందర్, సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఎడ్యుకేటర్లకు అవార్డులు

డిచ్‌పల్లి/ ధర్పల్లి, సెప్టెంబర్ 14 : ఆలిండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఎడ్యుకేటర్ అవార్డులను శనివారం అందజేశారు. హైదరాబాద్‌లోని బాలానగర్‌లో డిజిటల్ స్టూడెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలోని వందేమాతరం హైస్కూల్ కరస్పాండెంట్ విక్రాంత్, ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామానికి చెందిన శ్రీవిజ్ఞాన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కల్లెడి రాజు బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డులను అందుకున్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 14 : పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంతోపాటు మోపాల్ మండలం కంజరలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, డార్మెటరీ, స్టోర్, స్టాఫ్ రూములు, టాయిలెట్స్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యత, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బోధనా సిబ్బంది హాజరు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. భోజనం ఎలా ఉందని, దినచర్య ఎలా ఉంటుందని విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. కంజరలోని రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవన సముదాయం, డార్మెటరీని పరిశీలించారు. స్కూళ్ల నిర్వహణ, పరిసరాలు శుభ్రంగా ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమాభివృద్ధి అధికారిణి నిర్మల, సహాయ సంక్షేమాధికారి భూమయ్య, మోపాల్ ఎంపీడీవో రాములు ఉన్నారు.

**చందూర్ బీసీ హాస్టల్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్**

చందూర్, సెప్టెంబర్ 14 : మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో.. ఎంపీడీవో నీలావతితో కలిసి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, స్నానాల గదులు టాయిలెట్లతోపాటు వంట సామగ్రి, రికార్డులను పరిశీలించారు. వారి వెంట వార్డెన్ శేఖర్, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవం



ప్రతిభ పాఠశాలలో హిందీ భాషా ప్రాముఖ్యతను వివరించే చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఖలీల్‌వాడి/ సిరికొండ/ చందూర్/ మాక్లూర్/భీమ్‌గల్/ ఎడపల్లి, సెప్టెంబర్ 14 : జిల్లావ్యాప్తంగా హిందీ భాషా దినోత్సవాన్ని పలు కళాశాలల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషా ప్రాముఖ్యతను వివరించారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలోని సీనియర్ హిందీ అధ్యాపకురాలు కులకర్ణి కల్యాణిని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకుల ఆధ్వర్యంలో సన్మానించారు. సిరికొండలోని ప్రతిభ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సుంకం హరీశ్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం అశోక్, డైరెక్టర్ సుంకం స్వాతీగణేశ్, హిందీ బోధకులు ప్రదీప్, రజిని, స్రవంతి పాల్గొన్నారు. చందూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, కవితలు, పాటల పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, హిందీ ఉపాధ్యాయులు స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ బి.ప్రవీణ్‌కుమార్‌ను హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్ ప్రభుత్వ పాఠశాలలో హిందీ దివస్‌కు సంబంధించిన చిత్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు లావణ్య, దాసు, మమత, గంగాధర్, సురేశ్, గౌతమి, లక్ష్మి పాల్గొన్నారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ శివానందాన్ని ఘనంగా సన్మానించారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి , సెప్టెంబర్ 14 : మండలకేంద్రానికి చెందిన 11 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి జీపీ కార్యాలయంలో చెక్కులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ బాలకిషన్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ షాప్‌లో చోరీ

- రూ. 1.18 లక్షల అపహరణ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 14 : జిల్లాకేంద్రంలోని హమాల్‌వాడీలో ఉన్న ఓ మెడికల్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపు యజమాని ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి మెడికల్ షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా.. చోరీ జరిగినట్లు గుర్తించాడు. క్యాష్ కౌంటర్‌లో ఉంచి రూ.లక్షా 18 వేల నగదును చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆలయంలో పట్టపగలే దొంగతనం

- నిందితులను వెంబడించి పట్టుకున్న స్థానికులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 14 : నగర శివారులోని బోర్గం(పీ) గ్రామ పరిధిలో ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడ్డారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ కాలనీ శివారులోని సత్యనారాయణ స్వామి ఆలయ తలుపులు ధ్వంసం చేసి, శివుడి విగ్రహం పైన ఉన్న పంచలోహ, రాగి తొడుగులతోపాటు ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. చోరీ చేసినట్లు గుర్తించిన స్థానికులు దుండగులను వెంబడించి పట్టుకున్నారు. దుండగులకు దేహశుద్ధి చేసి నాలుగో టౌన్ పోలీసులకు అప్పగించగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు మద్యం షాపులు బంద్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 14 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జనం ఉన్న ప్రాంతాల్లో మద్యం షాపులు, బార్లు, కల్లు బట్టీలు మూసి ఉంచాలని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ సబ్‌డివిజన్ల పరిధిలో 9వ రోజు సుమారు 1800 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారని, అన్ని ప్రాంతాల్లో ఈనెల 15 ఉదయం 6 నుంచి 16వ తేదీ ఉదయం 10 గంటల వరకు మద్యం విక్రయాలను బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## రేపు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 14 : జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ట్రాఫిక్ మళ్లింపు చేపట్టనున్నట్లు సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్-ఉన్-నబీ పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. బోధన్ వైపు నుంచి వచ్చే వాహనాలు అర్సపల్లి చౌరస్తా మీదుగా కొత్త కలెక్టరేట్, కాలూర్ చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు, ధర్నాచౌక్ మీదుగా బస్టాండ్ కు వెళ్లాల్సి ఉంటుందని తెలిపపారు. నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, శివాజీచౌక్, నిజాంకాలనీ నుంచి అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా బోధన్ వెళ్లాలని సూచించారు.

## చెరువులో పడి పశువుల కాపరి మృతి

పొతంగల్, సెప్టెంబర్ 14 : పొతంగల్ మండలంలోని పెద్ద చెరువులో పడి పశువుల కాపరి మృతిచెందాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హంగర్గా గ్రామానికి చెందిన చాకలి పీరయ్య (45) పశువుల కాపరిగా పనిచేసేవాడు. శుక్రవారం సాయంత్రం చెరువులో పశువులు దిగగా.. బయటికి తోలే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పరుగు పందెంలో కోటగిరి మైనార్టీ కళాశాల విద్యార్థి ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీహరి

కోటగిరి, సెప్టెంబర్ 14 : నిజామాబాద్ అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 400 మీటర్ల పరుగు పోటీల్లో కోటగిరి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో ఎంపీసీ సెకండియర్ చదువుతున్న శ్రీహరి ప్రథమ బహుమతి సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ మహ్మద్ ముబీన్, ఫిజికల్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్, సిబ్బంది అభినందించారు. ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ స్టేట్ లెవల్ మీట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు.

## కొనసాగుతున్న 'జెండా' ఉత్సవాలు

- జెండాకు పూజలు చేసిన భక్తులు



జెండాకు పూజలు చేస్తున్న భక్తులు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 14 : ఈనెల 4వ తేదీన ప్రారంభమైన నగరంలోని జెండా బాలాజీ ఆలయ జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 11వ రోజు శనివారం జిల్లాకేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ప్రతిష్ఠించిన జెండాకు ముడుపులు కట్టి, పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 18న జాతరతో వేడుకలు ముగుస్తాయని ఆలయ ఈవో వేణు తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్, నాందేడ్, గుల్బర్గా తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నేడు (ఆదివారం) శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని స్వామి వారి కల్యాణాన్ని ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఏచూరి పోరాట పటిమను కొనసాగిస్తాం

నవీపేట/ ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 14: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పోరాట పటిమను కొనసాగిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్ అన్నారు. శనివారం నవీపేటలో పార్టీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేశాల గంగాధర్, సీపీఎం మండల నాయకులు నాయక్‌వాడ్ శ్రీనివాస్, దేవేందర్ సింగ్, సీఐటీయూ నాయకులు ఆంజనేయులు, సావిత్రి, పోగుల వసంత్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారంలోని గోశాల వద్ద పార్టీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత , రజియా, శ్రీదేవి, జ్యోతి, పద్మ, సోనీ, ఫిరంగీబాయి, రేఖ, అమృత పాల్గొన్నారు.

## ఉత్తమ గణేశ్ మండపాలకు పురస్కారాలు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 14 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెలకొల్పిన ఉత్తమ వినాయక విగ్రహాలు, అలంకరణలకు సంస్కార భారతి ఇందూరు ప్రతినిధులు శనివారం పురస్కారాలు అందజేశారు. మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన దుబ్బలోని ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ గణపతి ఉత్సవ కమిటీ, ప్రెస్‌క్లబ్, పోచమ్మగల్లీలోని 63 అడుగుల భారీ మట్టి వినాయకుడు, ఎల్లమ్మగుట్ట బ్యాంకు కాలనీలోని లక్ష్మీగణపతి... తదితర వినాయక మండపాల నిర్వాహకులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, కందకుర్తి ఆనంద్, గంట్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

## నీల్గాయిని చంపిన కేసులో వాహనాలు స్వాధీనం

సిరికొండ, సెప్టెంబర్ 14 : మండలంలోని రావుట్ల బీట్ పరిధిలో జంగిలోడి తండాలో పలువురు నీల్గాయిని శుక్రవారం వేటాడి చంపి, సమాన భాగాలుగా పంచుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో జంగిలోడి తండాకు చెందిన బనావత్ రాజును అరెస్టు చేయగా.. మరికొందరు పరారీలో ఉన్నారు. బనావత్ రాజుకు సంబంధించిన ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి భీంగల్ మండలం బాచంపల్లి వద్ద పట్టుకొని భీంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సెక్షన్ అధికారి సాయికిరణ్ తెలిపారు. మరో ఇద్దరు గుగులోత్ మహిపాల్, బనావత్ భోజ్యా వారి బైక్‌లను దాచి ఉంచగా.. సిరికొండలో వాటిని స్వాధీనం చేసుకొని, సీజ్ చేసినట్లు వెల్లడించారు.

### సంక్షిప్తంగా..

- **కోటగిరి మండల ప్రత్యేకాధికారిగా అలీం అహ్మద్ -** కోటగిరి, సెప్టెంబర్ 14 : కోటగిరి మండల ప్రత్యేకాధికారిగా అలీం అహ్మద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అలీం అహ్మద్‌కు కోటగిరి మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు అప్పగించారు.
- **పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ -** ధర్పల్లి, సెప్టెంబర్ 14 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహిస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను వారు శనివారం ఆవిష్కరించారు. ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆశిస్, దామోదర్, అర్చన, రాణి, స్నేహలత పాల్గొన్నారు.
- **పోగొట్టుకున్న ఫోన్ అందజేత -** సిరికొండ, సెప్టెంబర్ 14 : మండలంలోని తూంపల్లికి చెందిన అయినాల శ్రీకాంత్ ఇటీవల తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోలీసులు ఫోన్‌ను గుర్తించారు. బాధితుడికి ఎస్సై రామ్ శనివారం ఫోన్‌ను అందజేశారు.
- **యువతి అదృశ్యం -** వినాయక్‌నగర్, సెప్టెంబర్ 14 : నగరంలోని గౌతంనగర్‌కు చెందిన రహిళా భాను (24) అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు తన అన్న కూతురికి పౌష్టికాహారం తెచ్చేందుకు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్తున్నానని చెప్పిందని, తిరిగి ఇంటికి రాకపోవడం, మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి అన్న ఖాజా హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **గణేశ్ మండపంలో ఏసీపీ :** బోధన్, సెప్టెంబర్ 14: బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని వినాయక్‌నగర్‌లో ఏర్పాటుచేసిన గణేశ్ మండలిని ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ శనివారం సందర్శించారు. వారిని గణేశ్ మండలి నిర్వాహకుల తరపున బోధన్ తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాంబిరెడ్డి, చెరుకు రైతుల సంఘం అధ్యక్షుడు కేపీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సత్యం, థమ్సప్ రామకృష్ణ తదితరులు సన్మానించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ దంపతులు సందర్శించారు.
- **బాధితులకు ఫోన్ల అందజేత:** మాక్లూర్, సెప్టెంబర్ 14 : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన షబ్బీర్, బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన సుమలత, అమ్రాద్ తండాకు చెందిన బాలాజీ, బోర్గాంకు చెందిన మోహన్ ఇటీవల తమ ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నాలుగు ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు నాలుగు ఫోన్లను బాధితులకు శనివారం అప్పగించినట్లు పేర్కొన్నారు.
- **లయన్స్‌ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం :** బోధన్ రూరల్, సెప్టెంబర్ 14: సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో శనివారం లయన్స్ క్లబ్‌ఆఫ్ బోధన్, బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో కంటి వైద్య, షుగర్ శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సతీశ్ కంటి వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి పోశెట్టి, సాయిలు, రవి, నరేశ్ పాల్గొన్నారు.
- **నవీపేటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో.. :** నవీపేట,సెప్టెంబర్ 14: మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి రెండో శనివారం నిర్వహించే శిబిరానికి జిల్లా కేంద్రం నుంచి ముగ్గురు ప్రత్యేక వైద్యులు హాజరై రోగులకు పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కౌసిక్, అన్వేష్ కృష్ణ, అర్చన పాల్గొన్నారు.
- **శాంతియుతంగా గణేశ్ నిమజ్జనం చేయాలి:** ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్14: గణేశ్ నిమజ్జనం శాంతియుతవాతావరణంలో నిర్వహించుకోవాలని సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని సర్వసమాజ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17వ తేదీన గణేశ్ నిమజ్జనం రోజున మండపాల నిర్వాహకులు అన్ని శాఖల అధికారులకు సహకరించాలని కోరారు.

## చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

నందిపేట్, సెప్టెంబర్ 14 : మండలంలోని రైతుఫారం గ్రామానికి చెందిన బొంకన్‌పల్లి సాయిలు(55) ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి జారి పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బొంకన్‌పల్లి సాయిలు నిమ్మ పోచన్నతో కలిసి ఆంధ్రనగర్ సమీపంలో నందిపేట్-నిజామాబాద్ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మలను నరుకుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి సాయిలు మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముగిసిన గణిత విజ్ఞాన మేళా

భీమ్‌గల్, సెప్టెంబర్ 14 : మండల కేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ఇందూర్ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞానమేళా శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శిశుమందిర్ పాఠశాలల విద్యార్థులకు సైన్స్, గణితం, వేదగణితం, సంస్కృతి బోధన పరియోజన మొదలగు అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు అతిథులతో బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ బసంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు. భీమ్‌గల్ శిశు మందిర్ పూర్వ విద్యార్థి, ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ముద్దు కృష్ణను సన్మానించారు.

## అంగన్‌వాడీలో అవగాహన

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబర్14: పట్టణంలోని రాజారాంనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించినట్లు ఏసీడీపీవో జ్యోతి శనివారం తెలిపారు. సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ, విజయలక్ష్మి, కె.రజిత, అరుణ,నాగేశ్వరి, సవిత తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ అనఘా షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్ (M/F), అర్హత (డిగ్రీ) సాలరీ 15,000/- Month మరియు అనుభవం గల ఎలక్ట్రీషన్ (డిప్లొమ ఎలక్ట్రీషన్) సాలరీ 15,000/- Month కావలెను. ఆసక్తిగలవారు వెంటనే ఐడి ప్రూఫ్, ఫోటో, స్టడీ ర్టిఫికేట్‌తో నేరుగా సంప్రదించగలరు.

NTZ-340395

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# వసతి గృహాల్లో ముమ్మర తనిఖీలు

- మౌలిక వసతులపై ఆరా
- సమస్యలు తెలుసుకున్న అధికారులు



కోనాసముందర్‌లో ఎస్సీ బాలికల వసతి గృహంలో బెడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో



ధర్మారం (బీ)లో మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

మోర్తాడ్/భీమ్‌గల్/ రెంజల్/ఎడపల్లి/ నవీపేట/ ఏర్గట్ల/ముప్కాల్/ డిచ్‌పల్లి, సెప్టెంబర్ 14: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో స్థానిక అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వసతి గృహంలోని మౌలిక వసతులపై ఆరా తీసి, విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మోర్తాడ్ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని తహసీల్దార్ సత్యనారాయణ, కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలోని బాలికల ఎస్సీ వసతి గృహాన్ని ఎంపీడీవో రాజాశ్రీనివాస్ తనిఖీలు చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తాగునీరు, హాస్టల్ గదులు, భోజనశాల, వంటశాల, స్టోర్‌రూం, మూత్రశాలలు, డ్రైనేజీలను పరిశీలించారు. వసతిగృహంలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల కల్పనపై అధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. వారి వెంట ఆర్‌ఐ రంజిత్‌కుమార్, వార్డెన్ సాయికుమార్ ఉన్నారు.

భీమ్‌గల్ ఎస్సీ బాలికల వసతిగృహాన్ని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సందర్శించారు. వసతిగృహంలో గుర్తించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. భోజన వసతితోపాటు బాత్‌రూమ్, ఆహార నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్ నియామకం, ఆర్వో ప్లాంట్ మరమ్మతు, సీసీ కెమెరాల ఏర్పాటు, టాయిలెట్స్ రిపేర్, రూఫ్ లీకేజీ, డ్రైనేజీ తదితర సమస్యలను గుర్తించారు.

రెంజల్‌లోని ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతిగృహాలను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తనిఖీ చేసి, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం, నీటి సౌకర్యం, వసతులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వార్డెన్ శ్రీకాంత్‌కు సూచించారు.

ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాద్‌లో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తహసీల్దార్ దన్వాల్ శనివారం సందర్శించారు. వసతి గృహంలో మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను వార్డెన్ నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. నవీపేటలోని ఎస్సీ హాస్టల్‌ను తహసీల్దార్ వెంకటరమణ, బీసీ హాస్టల్‌ను ఎంపీడీవో నాగనాథ్, మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలను ఎంపీవో రామకృష్ణ తనిఖీ చేశారు. వసతి గృహాల్లో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏర్గట్లలోని బీసీ వసతి బాలుర గృహాన్ని తహసీల్దార్ శ్రీలత, కేజీబీవీని ఎంపీవో శివచరణ్ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు.

ముప్కాల్‌లోని కస్తూర్బా పాఠశాలను ఎంపీడీవో మహ్మద్ ముజాఫరొద్దీన్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. వంటగది, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

**మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ**

డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ) గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ యోహాన్ తనిఖీ చేశారు. హాస్టల్ తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.


## వేతనాలు చెల్లించాలని పీటీఎఫ్ కార్మికుల నిరసన



'తహసీల్' ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

మోర్తాడ్, సెప్టెంబర్ 14: తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీటీఎఫ్ (పార్ట్‌టైం ఫ్యూన్) కార్మికులు శనివారం మోర్తాడ్ తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..ఏడాది కాలంగా తమకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కుటుంబాలు దుర్భరస్థితిలో ఉన్నాయని, వేతనాలు ఇవ్వకపోతే కుటుంబపోషణ ఎలా అని ప్రశ్నించారు. తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పీటీఎఫ్ కార్మికులు గంగాధర్, నారాయణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు ధర్నా'ను విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

మోర్తాడ్/నందిపేట్/ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 14: రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా రూ.7500, వరికి రూ.500బోనస్ హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి రైతులందరూ తరలిరావాలని కమ్మర్‌పల్లి రైతు జేఏసీ పిలుపునిచ్చింది. శనివారం కమ్మర్‌పల్లిలో జేఏసీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, దీంతో తిరిగి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు గడ్డం నర్సారెడ్డి, సారా సురేశ్, నల్ల మోహన్‌రెడ్డి, సంత రాజేశ్వర్, రాజశేఖర్, బాలయ్య, మహేందర్, రాజన్న, అశోక్, కొమ్ముల రాజన్న, మల్లేశ్, రఘు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆర్మూర్ మండల రైతు నాయకులు హెచ్చరించారు. శనివారం వారు ఆర్మూర్‌లో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో రైతు నాయకులు నూతుల శ్రీనివాస్, భూమేశ్, భోజన్న, రమేశ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ మీడియా సమావేశంఏర్పాటు చేసి మాట్లాడారు. 16నఆర్మూర్ డివిజన్ పరిధిలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించాలని రైతులకు పిలుపునిచ్చారు.



మండలంలోని కల్లడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన యువసేన యూత్ సభ్యులు వారి మిత్రుడు రవి జ్ఞాపకార్థం 60 జతల క్రీడాయునిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామోజీ నాగరాజు యూత్ సంఘాల సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పింజ సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - మాక్లూర్, సెప్టెంబర్14

## పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

మోర్తాడ్, సెప్టెంబర్ 14: పౌష్టికాహారాన్ని తీసుకోవడం, సమయం ప్రకారం భుజించడం వల్ల రక్తహీనతకు చెక్‌పెట్టవచ్చని హెల్త్‌సూపర్‌వైజర్ ఆకుల మారుతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులు అన్నారు. మండలంలోని దొన్కల్ గ్రామంలో శనివారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజు తీసుకునే ఆహారంలో కోడిగుడ్లు, ఆకుకూరలు, తాజాకూరగాయలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు ఇచ్చే టీకాల గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు అలేఖ్య, అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**బషీరాబాద్‌లో రక్తదాన శిబిరం**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా న్యూస్టార్ యూత్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో గ్రామానికి చెందిన యువకులు రక్తదానం చేశారు. తలసేమియా చిల్డ్రన్స్ సొసైటీ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు యూత్‌సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆనంద్, బందెల రాజు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సుంకెటరవి, న్యూస్టార్ యూత్ సభ్యులు శంకర్, సౌమిత్, విజయ్, శేఖర్, భరత్, జైనంద్, నరేశ్, ప్రసాద్, వినయ్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించాలి

బోధన్ రూరల్, సెప్టెంబర్ 14: పోషణ లోపం ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెగడాపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జుబేరియా అన్నారు. బోధన్ మండలం పెగడాపల్లి పీహెచ్‌సీలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా లోప పోషణ ఉన్న పిల్లలకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సుధా, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 14: పట్టణంలోని మామిడిపల్లిలో విజయలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం 1987-88లో నిజామాబాద్ డైట్ కళాశాలలో టీటీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

## ప్లాస్టిక్‌పై అవగాహన

ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్14: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు విద్యార్థులకు ప్లాస్టిక్ వాడవద్దని సూచించారు.ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.